

## విద్యార్థుల కోసం రాష్ట్ర స్థాయి సమ్మేళనం

బాసర, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : సంస్కృతి, కళాసంపదను యువతకు చేరువ చేసేందుకు, స్పిక్‌మెకె తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో 4వ రాష్ట్ర సమ్మేళనం నిర్వహించనున్నారు. డిసెంబర్ 2 నుంచి 5 వరకు బాసరలోని ఆర్‌జీయూకేటీ-ఐఐఐటీలో జరుగుతుందని ఆర్‌జేయూకేటీ బాసర వీసీ ప్రొఫెసర్ ఏ. గోవర్ధన్ సోమవారం తెలిపారు. దేశం నలుమూలల నుంచి శాస్త్రీయ సంగీతం, నృత్యం, జానపద కళాకారులు హాజరవుతారని చెప్పారు. 8వ తరగతి, ఆపై విద్యార్థులు స్కూల్ నుంచి 5గురు, ఒక టీచర్ పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి గల వారు అక్టోబర్ 15వ తేదీ లోపల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.



## రైతులకు అండగా ఉంటా

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



ముథోల్‌లో తడిసిన సోయాపంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ముథోల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : రైతులకు వెన్నంటి ఉంటానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ఆదివారం కురిసిన భారీవర్షానికి ముథోల్‌లో తడిసిన సోయాపంటను సోమవారం పరిశీలించారు. సోయా దిగుబడులను ఆరబెట్టగా భారీ వర్షానికి తడిసిపోయి నష్టం జరగడం దురదృష్టకరమన్నారు. నష్టపోయిన పంట వివరాలను వ్యవసాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఆదుకునేలా చూస్తానన్నారు. సోయాపంట విషయమై అసెంబ్లీలో లేవనెత్తుతా అని అన్నారు. అలాగే పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వెంట మండల బీజేపీ అధ్యక్షులు కోరి పోతన్న, మాజీ సర్పంచ్, ఎంపీటీసీ గంట శ్రీనివాస్, దేవోజీ భూమేష్, నాయకులు ధర్మపురి శ్రీనివాస్, సప్పటోళ్ల పోతన్న, జీవన్, మోహన్ యాదవ్, బత్తినోళ్ల సాయి, బాలు, రైతులు, తదితరులున్నారు.

**ప్రజాదరణ మేరకే ప్రాధాన్యం...**

**భైంసా :** రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో ప్రజాదరణ, పార్టీ కార్యకర్తల అభిప్రాయాలకు అనుగుణంగానే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ చేపడుతామని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ వెల్లడించారు. మంగళవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో నియోజకవర్గ పరిధిలోని భైంసా, కుభీర్, కుంటాల మండలాల బీజేపీ శ్రేణులతో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సదస్సు నిర్వహించి మాట్లాడారు. పార్టీ కోసం పాటుపడే వారికి సముచిత స్థానం కల్పిస్తామని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులన్నీ బీజేపీ అభ్యర్థి ఎవరైనా వారి గెలుపే లక్ష్యంగా పెట్టుకొని పాటుపడాలని సూచించారు. జడ్పీపీఠంతో పాటు నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల ఎంపీపీ స్థానాలను సైతం కైవసం చేసుకునే లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఇప్పటి నుంచే స్థానిక సంస్థల ఎన్నికల ప్రచార పర్వాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. పార్టీ జిల్లా నూతన కార్యవర్గంలో చోటు దక్కించుకున్న నియోజక వర్గ ప్రతినిధులకు ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ నేతృత్వంలో బీజేపీ శ్రేణులు ఘనంగా సన్మానించాయి. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన యాతలం చిన్నారెడ్డి, ఉపాధ్యక్షుడిగా నియమితులైన గాలి రవిలకు సత్కరించి జ్ఞాపికలు అందచేశారు.







## మొక్కజొన్నకు మొలకలు



మొలకలు వచ్చిన కంకులు

కుభీర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కుభీర్ మండలంలోని మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండల కేంద్రానికి చెందిన కందూర్ సాయినాథ్ మూడెకరాల్లో, మాజీ ఎంపీటీసీ బసీర్ పటేల్ ఐదెకరాల్లో మొక్కజొన్న వేశారు. ముసురు వర్షాలకు సాయినాథ్ బషీర్ రైతు మక్కను కోసి కుప్ప వేశారు. వానలు వదలక పోవడంతో మొత్తం మక్క కంకులను మొలకలు వస్తుండడం చూసి రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఎకరాకు కనీసం రూ. 25వేల పైన ఖర్చు చేయగా పెట్టిన పెట్టుబడులు సైతం వచ్చేలా లేదని వాపోతున్నారు.









## కరాటేలో విద్యార్థుల ప్రతిభ



బ్లాక్ బెల్ట్ -3 సాధించిన విద్యార్థులు

నిర్మల్‌రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జుమ్మెరాత్‌పేట్ స్కూల్‌లో కరాటే బ్లాక్‌బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ గ్రేడింగ్ టెస్ట్‌లో మొట్టమొదటిసారిగా నిర్మల్ జిల్లాలో 11 మంది విద్యార్థులు ఒకేసారి నేషనల్ బ్లాక్‌బెల్ట్ - 3 (సందన్)కి అర్హులయ్యారు. విజయం సాధించిన విద్యార్థులకు బెల్ట్స్ సర్టిఫికెట్‌లు అందజేశారు. ఒకేసారి 11 మంది బ్లాక్‌బెల్ట్-3 సాధించటం జిల్లాకే గర్వకారణమని తెలంగాణ రాష్ట్ర చీఫ్ ఎగ్జామినర్ రాపోలు సుదర్శన్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా చీఫ్ ఎగ్జామినర్ తేజిందర్ సింగ్ భాటియా, నిర్మల్ జిల్లా టెక్నికల్ డైరెక్టర్ చందుల స్వామి, జిల్లా అధ్యక్షుడు కొండాజి శ్రీకాంత్, శ్రీనిర్మల్ జిల్లా సెక్రెటరీ అమ్ముల భూషణ్, శిక్షకులు ఊరే శ్రీకాంత్, కిరణ్, శేఖర్, చిరంజీవి, మనీషా, శివ, మేఘన, అమూల్య, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్థాయి బ్యాడ్మింటన్‌లో కాంస్యపతకం



శ్రీవల్లికి కాంస్యపతకం అందజేస్తున్న నిర్వాహకులు

నిర్మల్ రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పట్టణానికి చెందిన అనుముల అమర్ లావణ్య దంపతుల కుమార్తె శ్రీవల్లి ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని సాధించింది. ఉగాండా దేశంలోని కంపాలలో ఈ నెల 2 నుంచి 5 వరకు నిర్వహించిన ఉగాండా అంతర్జాతీయ సిరీస్ 2025లో సీనియర్స్ విభాగంలో ప్రతిభ కనబరిచింది. పట్టణంలోని రవి ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వర్ రావు, ప్రిన్సిపాల్ రాణి, పాఠశాల యాజమాన్యం శ్రీవల్లిని అభినందించారు.

# హస్తంలో ఐక్యతారాగం

- ఏకాభిప్రాయంతోనే స్థానిక అభ్యర్థుల ఎంపికకు నిర్ణయం
- ఉమ్మడి జిల్లా సీనియర్ నేతలతో ఇన్‌చార్జ్ మంత్రి సమీక్ష
- ఏకతాటిపై నడుస్తామంటూ నేతల ప్రకటన
- ఫలించిన వ్యూహం



నాయకులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

నిర్మల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో కలిసి కట్టుగా పనిచేస్తామంటూ అధికార కాంగ్రెస్ పార్టీ నేతలంతా తీర్మానించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లికృష్ణారావు ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పార్టీ నేతలతో జరిగిన సమావేశం రాబోయే స్థానిక ఎన్నికలకు దిశానిర్దేశం చేసింది. జూపల్లి డైరెక్షన్‌లో నేతలంతా ఏకతాటిపై నడుస్తామంటూ హామీ ఇవ్వడమే కాకుండా గెలుపోటములకు తమదే బాధ్యత అంటూ ప్రకటించడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొనబోతోంది. కొన్నిరోజుల నుంచి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నేతలు గ్రూపులుగా వీడిపోయి ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో మంత్రి జూపల్లి నిర్వహించిన సయోధ్య సమీక్ష సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. నేతల గ్రూపు తగాదాలు, వర్గ విభేదాల కారణంగా పార్టీలోని సీనియర్ కేడర్ కొద్ది రోజుల నుంచి గందరగోళానికి గురవుతోంది. నేతలంతా గ్రూపులుగా విడిపోయి ఎవరికి వారే సొంత ఏజెండాతో కార్యకలాపాలు సాగిస్తున్న కారణంగా ఆ పార్టీ కార్యకర్తలు ఎటువైపు ఉండాలో తెలియక సతమతమవుతున్నారు. ప్రభుత్వం వేలకోట్ల రూపాయలతో పెద్ద ఎత్తున సంక్షేమ అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నప్పటికీ నేతలు, కార్యకర్తల మధ్య సమన్వయలోపం ఆ పథకాల అమలుపై ప్రభావం చూపుతోందని అంటున్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు కారణంగా పార్టీకి ఇమేజ్ పెరగాలని ఆశిస్తుండగా నేతల మధ్య బేధాభిప్రాయాలు పథకాల అమలుకు సైతం ఆటంకాలు కల్పిస్తున్నట్లు పేర్కొంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి రాబోయే స్థానిక ఎన్నికలను అత్యంత సీరియస్‌గా తీసుకుంటున్న క్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నేతలను సమన్వయ పర్చే బాధ్యత ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు అప్పగించారు. దీనికారణంగా జూపల్లి కొద్ది రోజుల క్రితమే జిల్లా నేతలందరికీ ఐక్యత కొనసాగించాలంటూ మౌకిక సూచనలు జారీ చేశారు. అయితే స్థానిక ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ వెలువడిన కారణంగా ఆయన ఈ వ్యవహారాన్ని మరింత సీరియస్‌గా తీసుకున్నా రు. ఇందులో భాగంగానే జిల్లా ముఖ్య నేతలందరితో సమావేశమై రాబోయే స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంతో పాటు ఐక్యతరాగంపైనా చర్చించారు. చాలా ముక్కుసూటిగా వ్యవహరించే నేతగా పేరున్న జూపల్లి జిల్లా నేతలందరికీ సీరియస్‌గానే ఐక్య తవిషయంలోనూ, గెలుపు విషయంలోనూ స్పష్టమైన సూచనలు జారీచేసిన ట్లు పేర్కొంటున్నారు.

**జిల్లా నేతలకు జూపల్లి క్లాస్...**

కొంతకాలం నుంచి ఎడమోహం పెడమోహంగా ఉంటూ పార్టీ అధిష్టానం ఆదేశాలను సైతం పట్టించుకోకుండా వేరు వేరుగా కార్యకలాపాలు నిర్వహిస్తుండడాన్ని ఇన్‌చార్జీ మంత్రి జూపల్లికృష్ణారావు సీరియస్‌గా పరిగణించారు. ముఖ్యంగా నేతల ఐక్యత, బేధాభిప్రాయాల తొలగింపు, ఎన్నికల్లో గెలుపు పార్టీకి అత్యంత ముఖ్యమన్న విషయాలను మంత్రి జూపల్లి జిల్లా నేతలకు వార్నింగ్ రూపంలో నొక్కి చెప్పడం ప్రాధాన్యతకు కారణమవుతోంది.

### గెలుపే లక్ష్యంగా పని చేయాలి



మంత్రిని శాలువాతో సన్మానిస్తున్న దృశ్యం

నిర్మల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైదరాబాద్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో సోమవారం స్థానిక సంస్థల అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. క్షేత్రస్థాయిలో నేతలు చేపట్టాల్సిన కార్యక్రమాలను, ప్రజలకు వివరించాల్సిన పథకాలు, అభివృద్ధి పనుల గురించి మంత్రి వివరించారు. సమావేశంలో మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలచారి, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజేశ్వర్ రెడ్డి ఉన్నారు.

## ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠినచర్యలు



మాట్లాడుతున్న ఎస్సై అశోక్

కుంటాల, అక్టోబరు, 6 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో కఠినచర్యలు తప్పవని ఎస్సై అశోక్ అన్నారు. సోమవారం కుంటాల మండలంలోని వెంకూర్, విట్టాపూర్ గ్రామాల్లో ప్రజలకు ఎన్నికల నియమావళిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడకూడదన్నారు. 50 వేల రూపాయల కన్నా ఎక్కువ తీసుకెళ్లకూడదని సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. అంతేగాకుండా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాలలో, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, వ్యాపారస్తులు, మేధావులు కలిసి ముందుకు వస్తే సీసీ కెమెరాలతో ఏదైనా సంఘటన జరిగినప్పుడు సులువుగా గుర్తించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై జీవన్ రావు, సిబ్బంది ఉన్నారు.

## మహిళా సంఘాల్లో నగదు రహిత లావాదేవీలు



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా సంఘం సభ్యులు

నిర్మల్ రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని అన్ని గ్రామ సంఘాలు, సంఘ సభ్యులకు నగదురహిత లావాదేవీలపై శిక్షణ ఇవ్వడానికి మండలం నుంచి ముగ్గురు సీఆర్పీలను హైదరాబాద్ పంపించి ఐదురోజులు ట్రైనింగ్ ఇప్పించారు. మండలంలోని ముఠాపూర్‌లో మహిళా చైతన్య గ్రామ సంఘం సభ్యులకు సోమవారం నగదురహిత లావాదేవీలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. నగదురహిత లావాదేవీలను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలోభాగంగా జిల్లాలోని నిర్మల్‌రూరల్‌ను పైలెట్ మండలంగా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా సంఘసభ్యులు బ్యాంకు రుణాలు గాని, స్త్రీనిధి రుణాలు గాని నగదు రూపంలో చెల్లించకుండా నగదు రహిత రూపంలో (ఫోన్ పే, గూగుల్ పే) చెల్లించాలని శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీవో, ఓబీలు, సీసీ నర్సయ్య, సీఆర్పీలు దీపిక, అరుణ, వీవోఏ రాణి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష



పనులను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలోని పలు అభివృద్ధి పనులను కలెక్టర్ రాజర్షి షా క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లా కేంద్రం లోని ఖానాపూర్, తిరుపల్లి, బొక్కలగూడ, భగత్ సింగ్ నగర్, టీడబ్ల్యూఆర్జేసీ స్కూల్‌ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల వరదల కారణంగా హరి ఓం నగర్ బ్రిడ్జి డ్యామేజ్ అయిన నేపథ్యంలో మరమ్మతులకు రూ.12 లక్షలకు టెండర్ ప్రక్రియ పూర్తయిందని, పనులు త్వరగా ప్రారంభించి పూర్తిచేయాలని ఆదేశించారు. భగత్ సింగ్ నగర్‌లో మిషన్ భగీరథ పనులు పరిశీలించి కేంద్రీయ విద్యాలయనికి నీటి సరఫరా పూర్తిచేయాలన్నారు. తిర్పెల్లి వద్ద రోడ్డు పనుల సమస్యను అధికారులతో చర్చించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు ఉన్నారు.పట్టణంలోని తిర్పెల్లి శ్రీ రామలయాన్ని కలెక్టర్ రాజర్షి షా దర్శించుకు న్నారు.

### రైతులను ఆదుకోవాలని కలెక్టర్‌కు మాజీమంత్రి విజ్ఞప్తి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాను విపత్తు ప్రభావిత ప్రాంతంగా గుర్తించాలని, భారీ వర్షాల కారణంగా అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారని మాజీ మంత్రి జోగు రామన్నఅన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాను ఆయన కలిసి రైతు సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

## ఎన్నికల సిబ్బందికి శిక్షణ

తలమడుగు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకిడి రైతు వేదికలో సోమవారం తాంసీ, తలమడుగు, భీంపూర్. మూడు మండలాలకు చెందిన ఎన్నికల సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర ఎన్నికల అధికారి జారీచేసిన ఆదేశాల ప్రకారం ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. ఇందులో మూడు మండలాలకు చెందిన ఎంపీడీవోలు, ఎంపిఈవోలు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర పండుగగా కొమురంభీం వర్ధంతి

ఉట్నూర్/బోథ్, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం గోండు వీరుడు కొమురంభీం వర్ధంతిని రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని ఖానాపూర్ శాసనసభ్యుడు వెడ్మబొజ్జుపటేల్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం మొదటి సారిగా భీమ్ వర్ధంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం హర్షనీయం అన్నారు.

## యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలి

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు శారీరకంగా, మానసింగా ధృడంగా ఉండాలంటే నిత్యం యోగా చేయాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అశోక్ అన్నారు. సోమవారం బాలికల ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆదిలాబాద్ కింగ్స్ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో హెచ్ఎం రమేష్ రెడ్డి, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్, కార్యదర్శి, ఉపాధ్యాయులు, విద్యా ర్థులు పాల్గొన్నారు.

## వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

ఇంద్రవెల్లి,అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వన్య ప్రాణాలు సంరక్షణ బాధ్యత అందరిపై ఉందని ఇంద్రవెల్లి అటవీ శాఖ అధికారి సంతోష్ అన్నారు. సోమవారం అటవీ శాఖ 71వ వన్య ప్రాణి వారోత్సవాలో భాగంగా మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై అటవీ శాఖ అధికారులు ర్యాలీ నిర్వహించారు. వన్య ప్రాణుల సంరక్షణపై, వన్య ప్రాణుల సంరక్షణ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వోలు అటవీ శాఖ సిబ్బంది విశాల్, సంజీవ్ జొండ్లే తదితరులు ఉన్నారు.

# కన్నుల పండువగా బతుకమ్మ వేడుకలు



ఆదిలాబాద్‌లో ఎస్పీ అఖిల్...



తలమడుగులో బతుకమ్మ వేడుకలు



నేరడికొండలో పూజలు చేస్తున్న యువతులు

ఆదిలాబాద్ టౌన్/తలమడుగు/నేరడిగొండ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా బతుకమ్మ వేడుకలను జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో అంగరంగ వైభ వంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్, పోలీసు అధికారులు సిబ్బంది, హోమ్ గార్డ్స్ సిబ్బంది, వివిధ పోలీస్ వింగ్స్ లో పని చేసే మహిళా పోలీసులు బతుకమ్మ పండుగ సంబరాలల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మ వద్ద పూజలు చేసిన అనంతరం ఎస్పీ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. కోలాటాలు ఆడుతూ.. నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...పోలీసులు వారి కుటుంబ సభ్యులతో బతుకమ్మ ఆడడం, ఇంత మంది కుటుంబ సభ్యులను కలిసినందుకు ఆనందంగా ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో అద నపు ఎస్పీ బి.సురేందర్‌రావు, డీఎస్పీలు, సీఐలు, రిజర్వ్ ఇన్‌స్పె క్టర్లు, ఎస్సైలు, మహిళ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.తలమడుగులో తెలంగాణ పండుగలో ముఖ్య మైనబతుకమ్మ పండుగను ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో ఘనంగా నిర్వహిం చారు.ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఇందులో వెంకటేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షుడు కేథరేశ్వర్ రెడ్డి, గ్రామ పెద్దకాపు మెరుగు మోహన్ రెడ్డి. గ్రామస్తులు రమాకాంత్. నాగారెడ్డి ప్రతాప్ మల్లేష్‌మహిళలు తదితరులు పాల్గొ న్నారు. నేరడిగొండలో తెలంగాణ సంస్కృత సంప్రదాయా పండుగలో బతుకమ్మ పండుగను మహిళలు ఎంతో ఘనంగా జరుపుకున్నారు.

## జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసిన నేతలు

నేరడిగొండ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నాయకులతో సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో స్థానిక సంస్థల ఎన్నికల, బోథ్ నియోజకవర్గ తాజా రాజకీయ పరిస్థితులను వివరించి, జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపిక గురించి ప్రత్యేకంగా బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్‌చర్చించారు.ఈకార్యక్రమంలో ఉమ్మడిజిల్లానాయకులు పాల్గొన్నారు.

### .. మంత్రిని కలిసిన పలువురు

**ఆదిలాబాద్ టౌన్:** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి టెజో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు సోమవారం హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును మర్యాద పూర్వకంగా కలిసారు. మంత్రిని కలిసి శాలువాతో సత్కరిం చారు.కార్యక్రమంలో ముథోల్ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్ రెడ్డి , టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల బరిలో సీపీఎం

ఉట్నూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల బరిలో సీపీఎం ఉంటుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూసం సచిన్ అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొజ్జఆశన్న, ఉయిక విష్ణు, నాయకులు మడావినాగోరావు, సునిల్ తదితరులు పాల్గొన్నారు.

### శిశువుకు సంజీవనిగా నియోనాటల్ వాహనం

బజార్‌హత్నూర్,అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అప్పుడే జన్మించిన శిశువుకు అడ్వాన్స్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ అయిన నియోనాటల్ వాహనం మండలంలోని ఓ మారుమూల గ్రామ నవజాత శిశువుకు సోమవారం అత్యవసర సమయంలో ఆసరాగా నిలిచింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని సోమవారం దేద్రా గ్రామానికి చెందిన నాగుల్వాడ్ నిఖిత స్థానిక పీహెచ్‌సీలో మగబిడ్డకు జన్మనిచ్చింది.తక్కువ బరువు గల శిశువుకు హృదయ స్పందన హెచ్చు తగ్గులుండటంతో పైలెట్ శివకుమార్ సహాయంతో వెంటనే ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. అక్కడ ఎన్ఎస్ సీయు వార్డులో అన్ని రకాల పరీక్షలతో చికిత్స అందించి పసికందును తిరిగి పీహెచ్‌సీకి తరలించారు. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు. నవజాత శిశువులకు ఇలాంటి ఆపద రాకుండా సత్వర చికిత్స అందేలా ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయని నియోనాటల్ సిబ్బంది తెలిపారు. బేబీ వార్మర్‌తో పాటు గుండె ఆగిపో యే పరిస్థితిలో కృత్రిమ ఊపిరి పోసే ఏఈడీ యంత్రం అందుబాటులో ఉన్నాయని వివరించారు.

## మెజార్టీ స్థానాల్లో జెండా ఎగరేద్దాం



మాట్లాడుతున్న ఎంపీ నగేష్

మావల,అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి):స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీ టీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ మెజార్టీ స్థానాల్లో గెలుపొందేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ లు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పార్టీకి సంబంధిం చిన పలు అంశాలపై ఎంపీ, ఎమ్మెల్యేలు చర్చించారు. ఈ మేరకు ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ బీజేపీ తరఫున పోటీ చేసేందుకు పలువురు అభ్యర్థులు ఉత్సాహాన్ని చూపుతున్నారని అన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు బ్రహ్మానంద్, మయూరి చంద్ర నగేష్ రమేష్, రాజు విజయ్ రాకేష్ పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

● బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్

ఇంద్రవెల్లి/సిరికొండ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని బీఆర్ఎస్ ఖానాపూర్ నియో జకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక కాగ్నే ఫంక్షన్ హాల్‌లో మండలంలో బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించి పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డోంగ్రేమారుతి పటేల్, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ ఆంజద్, మండల కోఆర్డినేటర్ షేక్ సూఫీ యాన్, మాజీ కోఆప్షన్ మీర్జా జీలానీ బేగ్, సోషల్ మీడియా ఇన్‌చార్జీ ధరణి ధనరాజ్, మాజీ ఉప సర్పంచ్ గణేష్, శ్రీనివాస్, జాధవ్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో సిరికొండ మండల నాయకులు ఓరుగంటి పెంటన్న, లోకండే సునీల్, షేక్ రంజానీ, సాయిని నర్సయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తగ్గేదేలే!

(3వ పేజీ తరువాయి..)

చేస్తున్నారు. షెడ్యూల్ విడుదలైన వెంటనే దసరా పండుగ రావడంతో దావతులు ఊపందుకున్నాయి. పోటీ చేసే ఆశావహ నేతలు గ్రామాల్లోని ముఖ్యనేతలకు మందు పార్టీలు ఇస్తూ మచ్చిక చేసుకుంటున్నారు. ఇదే అదునుగా బెల్ట్ షాపుల నిర్వాహకులు కల్తీ మద్యాన్ని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పలు గ్రామాల్లో మద్యం మత్తులో ఘర్షణలు, వివాదాలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే కొన్ని వివాదాలు పోలీసుస్టేషన్ల వరకు చేరినట్లు తెలుస్తోంది.

## పత్తి రైతుకు గులాబీ గుబులు

(3వ పేజీ తరువాయి..)

లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగు కోసం చేసిన అప్పులు రెట్టింపులు అవుతోందని ఆవేదనకు లోనవుతున్నారు.

**● బోర్లు వేయిస్తున్న చుక్క నీరు రాక ● ఇదేమి కాలం..**

వాస్తవానికి ఇదిచలికాలం ప్రారంభం... కానీ అప్పుడే ఎండలు, అప్పుడే ఉక్కపోత.. నిమిషాల్లోనే ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడడంతో ప్రతి ఒక్కరు ఇదేమి కాలము అని అంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ కాలాన్ని చూస్తే ఎప్పుడు ఏ పంట పండుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ సంవత్సరం మాత్రం రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని చెప్పవచ్చు. అప్పుడే వ్యాధుల తీవ్రత సైతం పెరిగిపోయింది.

**● లక్షల్లో నష్టం**

ఎన్నో ఆశలు పెట్టుకొని తనకున్న 18 ఎకరాలలో పత్తి పంటను సాగు చేస్తున్నాను.ప్రస్తుతం పంట చేతికి వచ్చే సమయం. కానీ పంటకు గులాబీ రంగు పురుగు ప్రభావంతో పాటు కాయలన్నీ మొరిగిపోయాయి. ఖాతాపూత పంటకు లేదు.దీంతో ఎకరానికి మూడు క్వింటాళ్ళ దిగుబడి కూడా వచ్చే అవకాశాలులేవు.కానీ ఇప్పటి వరకు ఎకరానికి 35 నుంచి 45 వేల వరకు ఖర్చు చేశాను.కనీసం పెట్టుబడి అయిన వెళుతుందని ఆశపడితే అది కూడా వెళ్లే ప్రసక్తి లేదు. మరదల వల్ల తీవ్రంగా నష్టపోయాము.

- ముకుంద్, రైతు, తంతొలి

**దిగుబడులు తగ్గుతాయి**

ప్రస్తుతం పరిస్థితులు చూస్తే పంటల దిగుబడులు చాలా వరకు తగ్గుతాయి.ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కు నష్టపోయిన రైతులు మళ్లీ గులాబీ పురుగు ప్రభావం వల్ల కూడా నష్టపోవాల్సి వస్తుంది. ఎన్ని పురుగుమందులు వాడినా ఈ సంవత్సరం ఎందుకో తెలియదు కానీ ఆ పురుగును నివారించలేకపోయారు. తాంసి, తలమడుగు, భీంపూర్ మండ లాల్లో సైతం తీవ్రంగా నష్టాలు వాటిల్లే అవకాశాలు ఉన్నాయి. వాతావరణంలో కనుక మార్పులు వస్తేనే కొద్దిపాటి దిగుబడులు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

- రవీందర్, వ్యవసాయ అధికారి

## వాగు ఉప్పొంగడంతో ట్రాక్టర్లు బోల్తా

ఆదిలాబాద్‌రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. సోమవారం రూరల్ మండలంలో భారీగా వర్షం కురివడంతో అంకాపూర్‌లోని గ్రామ శివారులో ప్రవహిస్తున్న వాగు ఉప్పొంగడంతో మూడు ట్రాక్టర్లు బోల్తాపడ్డాయి. ఒక్కసారిగా వరద ఉధృతి పెరగడంతో ట్రాక్టర్లు బోల్తా పడ్డాయి. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్లు, కూలీలు వాగులో నుంచి సురక్షితంగా బయటపడ్డారు.

## ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

ఆదిలాబాద్‌టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమయ్యాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు యాసం నర్సింగ్ రావు, గోవర్ధన్, అడప తిరుపతి పాల్గొన్నారు.

### నాటుసారా తయారి కేంద్రాలపై దాడి

నార్నూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):అబ్కారి అసిస్టెంట్ కమిషనర్ ఆదిలాబాద్ జిల్లా ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని తాడిహత్నూర్, నాగలకొండ, భీంపూర్ గ్రామాల్లో నాటుసారా తయారీకేంద్రాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ డి.గంగారెడ్డి, సిబ్బంది ఇంతియాజ్, రవి, సందీప్, ఈశ్వర్ ఉన్నారు.

## సంఘ భవనానికి భూమి ఇవ్వాలని వినతి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

దస్తురాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన దస్తురాబాద్‌లోని గంగపుత్ర సంఘం సభ్యులు తమ సంఘానికి భూమి ఇవ్వాలని కోరుతూ సోమవారం డిప్యూటీ తహసీల్దార్ యాదవ్‌రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. మండలకేంద్రంలోని కేజీబీవీ పక్కన రెండో భాగంలో ఉన్న ఖాళీ భూమి పేద మత్స్యకార సంఘం భవనానికి అధికారికంగా ఆ భూమిని అప్పజెప్పాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అనంతరం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు జుంబర్తి రాజన్న మాట్లాడుతూ... గంగపుత్రులు 80 కుటుంబాలున్నాయని, పేద కుటుంబానికి సంఘ భవనం, నివాసం కోసం స్థలాన్ని ఇవ్వవలసిందిగా కోరుతున్నామని తెలిపారు. అలాగే ఈనెల 5వ తేదీన తాము హద్దులు పాతిన భూమిని గుర్తుతెలియని వారు ధ్వంసం చేశారని, వారిపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. మత్స్యకార సంఘం సభ్యు లు పాల్గొన్నారు.

### బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా విలాస్



కరిపేవిలాస్

సారంగాపూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : సారంగపూర్ మండల జామ్ గ్రామానికి చెందిన విలాస్ భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. బీజేఎల్పీ నేత ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రితేష్‌రాథోడ్‌కు పార్టీ అధిష్టానానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

## ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

దస్తురాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : దస్తురాబాద్ మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కోల మహేష్, రామగిరి పూర్ణచందర్, అధ్యక్షుడిగా నేరెళ్ల రమేష్, ఉపాధ్యక్షుడిగా అల్వాల వెంకటేష్ , ప్రధాన కార్యదర్శిగా కూచన్‌పెల్లి శ్రీనివాస్, కోశాధికారిగా బూస శేఖర్‌లను ఎన్నుకున్నారు. సభ్యులుగా మునిందర్, రాకేష్, శ్రీనివాస్, హరీష్, పూర్ణచందర్ ఉన్నారు.

## బాసరలో మళ్లీ పిచ్చి కుక్క దాడి

బాసర, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : బాసరలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గ్రామానికి చెందిన బాలుడు అల్లి అబ్దుల్లాపై ఓ వీధి కుక్క ఆదివారం దాడి చేసిన విషయం తెలిసిందే. ఆ ఘటన మరువకముందే సోమవారం కొక్కుల రాజుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. స్థానికులు గమనించి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స చేయించారు. కాలనీలలో కుక్కల బెడద అధికంగా ఉందని ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిని అరికట్టాలని కోరుతున్నారు.

# వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



ప్రమాదానికి గురైన బైక్



సాయినాథ్ మృతదేహం

నర్సాపూర్(జి), అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా, నర్సాపూర్(జి) పరిధిలోని 61 వ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 61)పై సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. రోడ్డు దాటుతున్న ఓ గేదెను ద్విచక్ర వాహనంపై వస్తున్న యువకుడు వేగంగా ఢీకొట్టడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. లోకేశ్వరం మండలం, హవర్గా గ్రామానికి చెందిన అరవింద్ పటేల్(27) తన ద్విచక్ర వాహనంపై నిర్మల్ వైపు నుంచి భైంసా వైపు ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. నర్సాపూర్(జి) వద్ద రోడ్డు దాటుతున్న గేదెను ఆయన బలంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మృతుడు అరవింద్ పటేల్ ఆదివారం నాడు సారంగాపూర్ మండలంలోని అడెల్లి పోచమ్మ దేవాలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా, మలక్ చించోలి వద్ద ద్విచక్ర వాహనం పైనుండి అదుపు తప్పి పడ్డాడు. అప్పుడు పెద్ద ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనాన్ని అక్కడే ఉంచి ఇంటికి వచ్చి, సోమవారం తన బైక్‌ను తీసుకురావడానికి వెళ్లిన సమయంలోనే నర్సాపూర్(జి) వద్ద రోడ్డు ప్రమాదానికి గురై మృత్యువాత పడ్డాడు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అటుగా వెళ్తున్న పోలీసులు శేఖర్, సంతోష్ స్పందించి సహాయం చేశారు. గాయపడిన అరవింద్‌ను అత్యవసర చికిత్స నిమిత్తం నిర్మల్ ఆసుపత్రికి తరలిస్తుండగా, దిలావర్‌పూర్ టోల్‌ప్లాజా దాటిన తర్వాత అతను మృతిచెందినట్లు ఈఎంటీ సృజన్, పైలట్ గోపి తెలిపారు. మృతదేహాన్ని నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అరవింద్ మరణ వార్త తెలియగానే అతని భార్య యోగిత, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

**రాంపూర్ వద్ద వరుస ప్రమాదాలు..**

నర్సాపూర్(జి) పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపూర్ బస్టాండ్ సమీపంలో వరుసగా రెండు రోజుల్లో రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఆదివారం లోలం గ్రామానికి చెందిన దూసముడి లక్ష్మీ(47), ఆమె కుమారుడు మహేష్ ప్రయాణిస్తున్న టీవీఎస్ ఎక్సెల్‌ను నర్సాపూర్(జి)కి చెందిన బర్కుంట గంగయ్య అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లక్ష్మీకి ఎడమ కాలు, భుజానికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను వెంటనే నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు ఏఎస్సై శంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం లక్ష్మీ(50) రోడ్డు దాటుతుండగా నిర్మల్ నుంచి మన్మథ్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఆమెకు స్వల్ప గాయాలు కాగా, కారులో ఉన్న సాయన్న ఆమెను నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వరుస ప్రమాదాలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..**

**తానూర్ :** బెల్‌తరోడా చెక్‌పోస్టు వద్ద బుధవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందారు. మహారాష్ట్రలోని ఉమ్రి గ్రామానికి చెందిన బోనారే సాయినాథ్ (25) అతని బావ స్నేహితుడు కలిసి పని నిమిత్తం తానూర్‌కు వేర్వేరుగా ద్విచక్రవాహనంపై బయలుదేరారు. బేల్‌తరోడా చెక్‌పోస్ట్ వద్ద గుర్తుతెలియని లారీ సాయినాథ్ ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టడంతో సాయినాథ్ అక్కడిక్కడే మృతిచెందాడు. అతని వెంట ఉన్న అతని బావ, అతని స్నేహితుడు గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో సాయినాథ్ మృతి చెందాడని పోలీసులకు తెలిపారు. ఎస్సై షేక్‌జుబేర్ మృతుని భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు.

# స్థానిక సమరంలో బీజేపీని గెలిపించాలి

**● బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్**



సమావేశంలో మాట్లాడుతున్న రితేష్ రాథోడ్

పెంబి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సమరంలో బీజేపీ జెండా ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, పెంబి మండల పరిధిలోని జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. ప్రజలంతా ప్రస్తుతం బీజేపీ వైపు చూస్తున్నారని, నరేంద్ర మోదీ పథకాలతో ప్రజలంతా ఆనందంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు నాగరాజు, సుదర్శన్, రాంసింగ్, నగేష్, రవి, రాజేందర్, రాజు, శ్రీనివాస్, గణేష్, దేవుసింగ్, మాణిక్ రావు, తదితరులు పాల్గొన్నారు.

**ముగ్గురు ఖానాపూర్ వాసులకు బీజేపీ జిల్లా కమిటీలో చోటు...**

**ఖానాపూర్:** బీజేపీ జిల్లా కమిటీలో ముగ్గురు ఖానాపూర్ వాసులకు చోటు లభించినట్లు పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ తెలిపారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఖానాపూర్‌కు చెందిన నల్ల రవీందర్, జిల్లా కార్యదర్శిగా మదిరే శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా గడ్డం రవీందర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం ఖానాపూర్‌లో నిర్వహించిన బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో ముగ్గురు నాయకులను రితేష్ రాథోడ్ అభినందించారు.

**పార్టీ బలోపేతానికి కృషి..**

**మామడ :** బీజేపీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేస్తానని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్ర రాజారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరిపే విలాస్, జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్ర రాజారెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బాపురెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బి. రంజిత్ కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ చిన్నారెడ్డి పాల్గొన్నారు.

## ఇన్‌చార్జ్ మంత్రి సమీక్షకు తరలిన నాయకులు



జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లిని సన్మానిస్తున్న ముథోల్ మాజీ ఎమ్మెల్యే

భైంసా, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి మంగళవారం హైదరాబాద్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముథోల్ నియోజకవర్గ పరిధి నుంచి మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీఎమ్మెల్యే విఠల్‌రెడ్డి డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుతో కలిసి ఇన్‌చార్జీ మంత్రిని సన్మానించారు. అనంతరం ముథోల్ నియోజకవర్గ ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీస్థితి,గతులు, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ, పార్టీ గెలుపు అవకాశాలు తదితర అవకాశాలపై చర్చించినట్లుగా తెలిసింది. ఇందులో భాగంగానే ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి నియోజకవర్గ పార్టీ ప్రతినిధులకు స్థానిక సంస్థల ఎన్నికల పర్వాన్ని ప్రతిష్టాత్మంగా తీసుకోవాలని సూచించినట్లుగా సమాచారం. ఎలాంటి భేదాభిప్రాయాలకు తావులేకుండా, వర్గపోరుకు అస్కారం కలుగనీయకుండా సమన్వయంతో ఏకాభిప్రాయం సాధించి అభ్యర్థులను ఎంపిక చేయాలని పేర్కొన్నట్లుగా తెలిసింది. ఇదే క్రమంలో పార్టీ ప్రతినిధులు ఐక్యతతో వ్యవహరిస్తూ, సమిష్టిగా కృషిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని తెలిపినట్లుగా సమాచారం.

## అమ్మిన కూతురిని తీసుకువచ్చి అంత్యక్రియలు



తండ్రి చితికి నిప్పు పెడుతున్న కుమార్తె

నిర్మల్ రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవర్నమెంట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన వ్యక్తికి అంత్యక్రియలు నిర్వహించినట్లు ఐక్యత సేవా సమితి సభ్యులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని యావత్‌మల్‌కు చెందిన వ్యక్తి తన కూతురిని చిన్నప్పుడే అమ్మేశాడు. ఇతడిని భార్య వదిలేసింది. మరణ వార్త తెలుసుకున్న ఐక్యత సేవా సమితి కూతురిని తీసుకువచ్చి సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు.

## బైక్ దొంగ అరెస్ట్



నిందితుడితో సీఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్సై అశోక్

మామడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : కొద్ది రోజులుగా వివిధ గ్రామాల్లో బైక్‌లను చోరీ చేస్తున్న వ్యక్తిని సోమవారం అరెస్ట్‌చేసి బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని సోన్ సీఐ గోవర్ధన్‌రెడ్డి, ఎస్సై అశోక్‌లు తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించారు. మండలంలోని కిషన్‌రావుపేట్ గ్రామానికి చెందిన బాణావత్ వెంకట్రావు కొంతకాలం నుంచి జల్సాలకు అలవాటు పడి బైక్‌లను చోరీ చేయడం మొదలుపెట్టాడు. పరిమండల్ గ్రామానికి చెందిన ధర్మన్న, ఆర్మూర్‌కు చెందిన మరోవ్యక్తి బైక్‌లను దొంగిలించాడు. అనుమానం రావడంతో బైక్‌పై వెళ్తున్న వెంకట్రావును పట్టుకుని విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.


ఉప్పొంగి ప్రవహిస్తున్న పొచ్చెర జలపాతం

## జల జల పారుతున్న పొచ్చెర జలపాతం

బోథ్, అక్టోబరు 6, (ఆంధ్రజ్యోతి): మండలంలో భారీ వర్షం కురవడంతో పొచ్చెర జలపాతం వరద నీటితో పోటెత్తింది. ఉప్పొంగి ప్రవహించిన జలపాతం ఆకట్టుకుంది.

## గడ్డెన్నవాగు ప్రాజెక్టు మూడు వరద గేట్ల ఎత్తివేత

» సుద్దవాగులోకి 22,681 క్యూసెక్కుల వరద నీటి వదిలివేత

» నీట మునిగిన సుద్దవాగు బైపాస్ రోడ్డు వంతెన

భైంసా, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎగువనున్న మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలతో సోమవారం గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. ఈ క్రమంలో ప్రాజెక్టు నిర్వాహణాధికారులు వరద నీటి చేరికకు అనుగుణంగా దిగువనున్న సుద్దవాగులోకి వరద నీటిని వదిలివేసారు. ఉదయం వేళలో ప్రాజెక్టులోకి వరద నీటి చేరిక 3000 క్యూసెక్కుల నుంచి క్రమక్రమంగా 22 వేల క్యూసెక్కుల వరకు పెరిగింది. దీంతో ప్రాజెక్టు నిర్వాహణాధికారులు వరద నీటి చేరిక పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ స్పిల్‌వే గేట్ల ద్వారా దిగువకు నీటిని వదిలి వేసారు. తొలుత ఒక వరద గేట్ ద్వారా నీటిని వదిలివేసి అధికారులు తదనంతరం మరో రెండు వరద గేట్లను ఎత్తివేసి మొత్తం మూడు వరద గేట్ల ద్వారా దిగువన ఉన్న సుద్దవాగులోకి 22,681 క్యూసెక్కుల నీటిని వదిలివేసారు. ఈ క్రమంలో భైంసాలోని సుద్దవాగు బైపాస్ రోడ్డు వంతెన నీట మునగడంతో అక్కడి ప్రాంతం మీదుగా రాకపోకలు నిలిచిపోయాయి. సాయంత్రం 4 గంటల సమయానికి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో రెండు వరద గేట్లను మూసివేసి ఒక వరద గేట్ ద్వారా 3338 క్యూసెక్కుల నీటిని వదిలివేసే చర్యలను కొనసాగించారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 358.7 మీటర్లు, 1.83 టీఎంసీలు ఉండగా మంగళవారం సాయంత్రం 4 గంటల సమయానికి 358.5 మీటర్లు, 1.712 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి.


సుద్దవాగు వంతెన మీదుగా ప్రవహిస్తున్న వరద నీరు


గడ్డెన్నవాగు ప్రాజెక్టు గేట్ల నుంచి సుద్దవాగులోకి వదిలిన వరద నీరు

## శారదా దేవికి 108 రకాల నైవేద్యం


నైవేద్యం సమర్పిస్తున్న ఆర్యవైశ్య మహిళా మండలి ప్రతినిధులు

భైంసా, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో శారదా దేవి వేడుకలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. వేడుకలలో భాగంగా ఉదయం వేళ నుంచి రాత్రి వరకు భక్తుల కోలాహలం మధ్య ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే మంగళవారం ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు అమ్మవారికి 108 రకాల ప్రసాదాలతో నైవేద్యం సమర్పించారు. ఉదయం వేళ పూజ కార్యక్రమంలో భక్తులు పండ్లు,పాలు,చక్కెర, పిండిలతో కూడిన పధార్థాలతో 108 రకాల ప్రసాదాలను తయారు చేసిన ప్రసాదాలను నివేదించారు. పూజ కార్యక్రమం ముగిసిన అనంతరం అమ్మవారికి సమర్పించిన నైవేద్యాన్ని భక్తులకు ప్రసాదంగా అందించారు.ఆదివారం ప్రారంభమైన వేడుకలు గురువారం నిమజ్జనోత్సవ కార్యక్రమ నిర్వాహణతో ముగియనున్నాయి.

## శివసాయి ఆలయంలో రుద్రయాగం


కుభీర్‌లో యాగాన్ని ప్రారంభిస్తున్న అర్చకులు

కుభీర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివసాయి ఆలయంలో సోమవారం రుద్రయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో దేవతామూర్తులకు అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేసి గణపతి పూజ నిర్వహించి దంపతులతో రుద్రయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు సంతోషంతో పాటు పంటలు సమృద్ధిగా పండాలని యాగాన్ని నిర్వహించినట్లుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పురోహితులు ఈరలింగం, విశ్వంబర్, ఆలయ కమిటీ నాయకులు ప్రతాప్‌సింగ్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణపై శిక్షణ

బోథ్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణ సమయంలో పకడ్బందీగా వ్యవహరించాలని ఎట్టి పరిస్థితుల్లో ఒకరికి మద్దతు ఇవ్వవద్దని సూచించారు. శిక్షణలో బోథ్, సొనాల, బజార్హత్నూర్ మండలాల అధికారులు పాల్గొనగా శిక్షణను ప్రభుత్వ శిక్షకులు రమాకాంత్, రాజ, శంకర్‌లు ఇచ్చారు. కార్యక్రమంలో బోథ్ ఎంపీడీవో రమేష్, బజార్హత్నూర్ ఎంపీడీవో శ్రీనివాస్, సొనాల ఎంపీడీవో రాజేశ్వర్‌లతో పాటుగా ఎంపీఈవోలు అతుల్ కుమార్ మహేందర్ రెడ్డిలు ఉన్నారు.

## పౌల్ట్రీఫారం నిర్మాణానికి అనుమతులు ఇవ్వద్దు

బోథ్, అక్టోబరు 6, (ఆంధ్రజ్యోతి): సొనాల మండలంలోని గుర్రాల తాండ గ్రామం సమీపంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన పౌల్ట్రీ ఫారానికి అనుమతులు ఇవ్వవద్దని గుర్రాల తండా గ్రామస్థులు సోమవారం ఎంపీడీవో, తహసీల్దార్‌లకు వేర్వేరుగా వినతిపత్రం అందించారు. పౌల్ట్రీషెడ్ నిర్మిస్తే తమ గ్రామానికి దుర్వాసన వస్తుందని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయమై ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు.

# భారీ వర్షం..అతలాకుతలం




పెంచికల్‌పాడ్ గ్రామంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు


కుంటాల సమీపంలో పత్తి చేనులో చేరిన నీరు

» ఆందోళనలో అన్నదాతలు

» జలమయమైన పంటలు

» కల్లాల్లో తడిసి ముద్దయిన ధాన్యం

కుంటాల, అక్టోబరు, 6 (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలో ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో ఇప్పటికే కోతకోసి కల్లాల్లో ఆరబెట్టిన సోయా, మొక్కజొన్నలు తడిసి ముద్దవగా కోత దశలో ఉన్న సోయా పంట దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అంతేగాకుండా పత్తిపంట సైతం చేతికొచ్చే దశలో రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఇప్పటికే గత నెల రోజుల నుంచి నిరవధికంగా కురిసిన వర్షాలు వారం పాటు కురియకపోవడంతో కాస్త దిగుబడులు తగ్గినా పంటలు త్వరగా కోతకోసి అమ్ముకుందామనుకున్న రైతులకు ఆదివారం సాయంత్రం కురిసిన వర్షంతో ఇబ్బందుల పాలయ్యారు. కోత కోసిన రైతులు కల్లాల్లో ధాన్యం తడిసి ఇబ్బందుల పాలవుతుంటే కోతకు వచ్చి కోసే దశలో ఉన్న రైతుల పరిస్థితి మరో రకంగా ఉంది. ఈ వర్షానికి మరో వారం పాటు పంట కోసే పరి స్థితి లేదు. పంట చేలలో భారీగా నీరు చేరింది. దీంతో పంట చేను ఆరే వరకు రైతు వేచి చూడాల్సిందే. అయితే అప్పటి వరకు సోయా పంట మొలకెత్తే అవకాశం ఉందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పత్తి పంటలో సైతం కాయ పగిలే సమయం వచ్చింది. రోజు వర్షం కురియడంతో పత్తి కాయ వర్షానికి పాడైపోతుందని ఆందోళన చెందుతున్నారు. ఏదీ ఏమైనప్పటికి ఈ ఏడాది వర్షాలకారణంగా రైతన్నల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది.

# కన్నీరు పెట్టిస్తున్న టమాటా

బజార్ హత్నూర్, అక్టోబరు 6, (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి రూ.లక్షలు ఖర్చు చేసి టమాట సాగు చేస్తే కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. బహిరంగ మార్కెట్లో టమాటా ధర పలకకపోవడంతో టమాట రైతుల కంట కన్నీరు మిగులుతోంది. పంట చేతికొచ్చే సమయానికి ధరలు పతనమై అన్నదాతలు అవస్థల పాలవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తెగుళ్ల ప్రభావంతో దిగుబడులు మరింత తగ్గాయి. అదే సమయంలో గిట్టుబాటు ధర సైతం లభించక రైతులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. కాగా ఈ ఏడాది మొదట్లో నాణ్యమైన టమాట (25 కిలోల పెట్టె) రూ.800- 900 పలకగా కాస్త నాణ్యత లోపించి 300-400 మధ్య పలికిందని, ప్రస్తుతం రూ. 150- 200 మాత్రమే వస్తోందని రైతులు చెబుతున్నారు. బజార్ హత్నూర్ మండలం టెంబి గ్రామానికి చెందిన సిడాం శ్రీరాం ఎకరం భూమిలో సాగుచేసిన టమాట పంటలో పెట్టుబడి కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.


టెంబి గ్రామ సమీపంలో సాగు చేసిన టమాటా పంట క్షేత్రం

# పార్టీల్లో జోష్ నింపిన ఎన్నికల ప్రకటన

ఉట్నూర్, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడంతో కొన్ని నెలలుగా స్తబ్దంగా ఉన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తల్లో కొత్త జోష్ నిండింది. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆయా పార్టీల్లోని అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగా ప్రతిపక్ష పార్టీలుగా ఉన్న బీఆర్ఎస్, బీజేపీల నాయకులతో పాటు స్థానికంగా బలంగా ఉన్న నాయకులు సైతం స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నారు.

**● రిజర్వేషన్లతో ఆందోళన**

సర్పంచ్ అభ్యర్థులుగా ప్రకటించుకొని తమకు తాము కొన్నేళ్లుగా స్వచ్ఛంద కార్యక్రమాలు చేపడుతున్న నాయకులు సైతం తమ విజయం ఖాయం అయినట్లేనని భావిస్తున్నారు. అయితే ఎన్నికల కమిషన్ అధికారుల ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు అధికార యంత్రాంగం ప్రకటించడంతో తాము పోటీ చేయాలనుకున్న స్థానాలకు మహిళ రిజర్వేషన్లు రావడంతో పురుష అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు. మరికొందరు మాత్రం తమ సతులను అభ్యర్థులుగా దింపాలని భావిస్తున్నారు. ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానం మహిళకు రిజర్వు కావడంతో పోటీ ప్రయత్నాల్లో ఉన్న పురుష అభ్యర్థులు కొందరు సతులను, కొందరు తల్లులను, మరికొందరు ఆడ పడుచులను రంగంలో దించాలని భావిస్తున్నట్లు తెలుస్తుంది. సర్పంచ్ అవకాశం పోయినప్పటికీ ఎంపీటీసీ స్థానాలలో పోటీ చేయవచ్చని మరికొందరు భావిస్తున్నారు.

**● ప్రారంభమైన పార్టీల కసరత్తు..**

ఏజెన్సీలోని గిరిజన ప్రాంతాలలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఎంపీపీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలతో పాటు సర్పంచ్ అభ్యర్థులను సైతం ఖరారు చేయడానికి రాజకీయ పార్టీలు కసరత్తు ప్రారంభించాయి. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ ఇప్పటికే ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి ఎన్నికల్లో విజయం సాధించేలా అభ్యర్థులను సూచించాలని కోరడంతో ఆయా మండలాల నాయకులు సూచించిన పేర్లతో ఉన్న జాబితాలను, వారి దరఖాస్తులను అధిష్ఠానం దృష్టికి పంపించారని తెలుస్తుంది. బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్‌రాథోడ్ ఇప్పటికే ఆయా మండలాల నాయకులతో ఎన్నికల కసరత్తు సమావేశాలు నిర్వహించి అభ్యర్థుల ఖరారు కోసం కార్యకర్తలు నాయకుల ద్వారా సూచనలు స్వీకరించారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి జాన్సన్ నాయక్ సైతం సోమవారం ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాల్లో అభ్యర్థుల ఖరారు కోసం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. 2 రోజుల్లో హైకోర్టుల్లో వచ్చేతీర్పును అనుసరించి ఎన్నికలు ఉంటాయా లేదా అన్నది ప్రశ్నార్థకంగా ఉన్నా.. పార్టీలు మాత్రం అభ్యర్థుల వేటలో నిమగ్నమై ఉన్నాయి.

## ఎర్వచింతల్‌లో వింత పశువు జననం

» ఆరు కాళ్లు, రెండు తలలు ఉన్న దూడకు జన్మనిచ్చిన గేదె

ఖానాపూర్, అక్టోబరు 6, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్వచింతల్‌లో ఓ వింత జరిగింది. గ్రామానికి చెందిన ఇస్లావత్ సీతానాయక్ అనే రైతు ఇంట ఆదివారం ఓ గేదెకు ఆరు కాళ్లు, 2 తలలతో ఉన్న దూడ జన్మించింది. అయితే అది పుట్టిన వెంటనే ప్రాణాలు కోల్పోయింది. దానిని చూసేందుకు గ్రామస్థులు తరలివచ్చారు. గతంలో ఎన్నడూ ఇలాంటి దూడను చూడలేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కాగా దూడకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.


ఎర్వచింతల్‌లో వింత ఆకారంతో జన్మించి మృతి చెందిన దూడ

## అటవీ అధికారుల తనిఖీలు

సిరికొండ, అక్టోబరు 6, (ఆంధ్రజ్యోతి): అడవికి హాని తలపెట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని ఉట్నూర్ ఎఫ్‌డీవో రేవంత్ చంద్ర హెచ్చరించారు. సోమవారం సాయంత్రం అటవీ సిబ్బందితో కలిసి మండలం కేంద్రంలోని పలువురి కార్పెంటర్ ఇళ్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో సుమారు రూ. 18 వేల విలువ గల టేకు కలప సద్దాం, షౌకత్‌ల వద్ద లభ్యమైందన్నారు. తలుపులు, దర్వాజాలు, మరికొన్ని టేకు కలప సైజులను స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో సిరికొండ, వాయిపేట్ సెక్షన్ అధికారులు చంద్రారెడ్డి, సత్తయ్య, బీట్ అధికారులు ఆడే సంతోష్, భీంసింగ్, హీరాలాల్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.



# ఆవుపై పులి దాడి

● ఆందోళనలో ప్రజలు

● అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

బోథ్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బోథ్ రేంజ్ పరిధిలో మరోసారి పులి సంచారం కలకలం రేపింది. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో నిగిని గ్రామానికి చెందిన ధ్రువ గంగారం అనే రైతు తన ఆవులను మేపుతుండగా అడవుల్లో నుంచి ఒక్కసారిగా వచ్చిన పులి చూస్తుండగానే దాడి చేసి ఆవును అడవిలోకి తీసుకువెళ్లింది. దీంతో రైతు తీవ్ర భయాందోళనకు గురై, గ్రామస్థులకు సమాచారం అందించాడు.


పులి దాడిలో మృతి చెందిన ఎద్దు

**● రక్షణ చర్యలు చేపట్టాం**

పులి రక్షణ పైన గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అటవీశాఖ అధికారి ప్రణయ్ పేర్కొన్నారు. ఇప్పటికే గ్రామాలలో రైతులకు విద్యుత్ కంచెలను ఏర్పాటు చేయవద్దని వివరించడం జరిగిందని పేర్కొన్నారు. అంతేగాక పశువుల మేపేవారు అడవుల లోపలికి వెళ్లవద్దని వివరించినట్లు తెలిపారు. పొలం పనులకు వెళ్లేవారు ఒంటరిగా వెళ్లవద్దని సూచించడం జరిగిందని పేర్కొన్నారు. రైతులు, కూలీలు తగు జాగ్రత్తలు తీసుకొని పొలం పనులకు వెళ్లాలని కోరారు.

## ఉప్పొంగిన నక్కలవాడ వాగు

బోథ్, అక్టోబరు 6, (ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలో సోమవారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని పలు గ్రామాల సమీపంలో ఉన్న వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. ప్రధానంగా మండలంలోని నక్కల వాడ వాగు బ్రిడ్జిపై నుంచి ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఈ రూట్‌లో ప్రయాణించే ఆరు గిరిజన గూడేల ప్రజలు గ్రామం దాటి బయటకు రాలేకపోతున్నారు. అంతేగాక వాగుపై ఉన్న బ్రిడ్జి కొంత మేరకు కొట్టుకుపోవడంతో ప్రమాదకరంగా మారింది. అధికారులు వెంటనే స్పందించి బ్రిడ్జి ఎత్తు పెంచాల్సిన అవసరం ఉందని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే ఇబ్బందులు తప్పడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.


ఉధృతంగా ప్రవహిస్తున్న నక్కలవాడ వాగు





# తాళం వేసి ఉన్న గృహాలే లక్ష్యంగా దొంగతనాలు

- అశోక్ నగర్ కాలనీలో చోరీలతో ప్రజలు బెంబేలు
- పోలీస్ స్టేషన్ కాలనీలో అర్ధరాత్రి చోరీ

ఇచ్చోడ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసి ఉన్న గృహాలే లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు తెగబడుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇచ్చోడ పట్టణ పరిధిలోని పోలీస్‌స్టేషన్ ఉన్న కాలనీ ఆశోక్ నగర్ కాలనీలో తాళం వేసి ఉన్న ఇళ్లల్లో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. కాలనీవాసులు, స్థానికులు, ఇంటి యాజామానులు తెలిపిన వివరాల ప్రకార మండల కేంద్రంలోని ఆశోక్‌నగర్ కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు గోడం చంద్ర కాంత్, అడ్వకేట్ దమ్మపాల్ ఇంట్లో చోరబడ్డ దుండగులు ఇళ్ల తాళాలను పగులగొట్టి ఇంట్లోకి వెళ్లి ఇళ్లలో ఉన్న బీరువాలను ధ్వంసం చేసి బీరువాలో ఉన్న బట్టలు వస్తువులను చిందరవందరగా పాడేసి దాదాపు 15 తులాల బంగారంతో పాటు రెండున్నర లక్షల నగదును దొంగలించినట్లు పేర్కొన్నారు. అదే రోజు ఒక ద్విచక్ర వాహనాన్ని కూడా కాలనీలో దొంగలించడం జరిగింది. కాలనీలల్లో తిరిగి తాళం ఉన్న ఇళ్లను చూసి రాత్రిల్లో చోరికి పాల్పడుతున్నారని స్థానికులు అంటున్నారు. కాలనీలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తే నలుగురు దుండగులు రాత్రి సమయంలో కాలనీలో తిరుగుతూ కనిపించారు. చోరీ జరిగిన ఇళ్లకు యాజామానులు ఉదయం వచ్చి చూసే సరికి తాళాలు పగిలి ఉండడం ఎక్కడ పడితే అక్కడ వస్తువులు పడేసి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసు జాగిలాలతో పలు ఆధారాలను సేకరించారు.



చోరీకి గురైన ఇళ్లు

### కాలనీల్లో సంచరిస్తున్న కొత్త వ్యక్తులు

గ్యాస్ స్టవ్ మరమ్మతులు, ఉల్లిగడ్డలు, ఎల్లి, ఉల్లిగడ్డలు, పాత ఇనుప సామన్లు, చిత్తు పేపర్లు, సేల్స్ బాయ్స్, అనాధా ఆశ్రమాలకు పాత దుస్తులు ఇవ్వండి అంటూ ఆటోలు, ద్విచక్రవాహనాలపై మైక్‌లు పట్టుకుని వచ్చిన వారు ఆయా పరిసరాలపై అవగాహన పెంచుకోవడం చేస్తున్నారని స్థానికులు భావిస్తున్నారు. కాలనీల్లో సీసీ కామెరాలు ఏర్పాటుచేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నా. ప్రజలకు స్పందన ఉండడం లేదు. ఊరెళ్తె పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.



# స్థానిక ఎన్నికలకు సర్వం సిద్ధం

ముఖాముఖి



● రమేష్, జిల్లా పంచాయతీ అధికారి

**ప్రశ్న:** స్థానిక ఎన్నికలను నిర్వహించేందుకు ఎలాంటి ఏర్పాట్ల ను చేస్తున్నారు?

**జవాబు:** స్థానిక ఎన్నికలను నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లనుపకడ్బందీగా చేస్తున్నాం. ఇప్పటికే స్టేజ్ -1, స్టేజ్ -2 అధికారులకు శిక్షణను పూర్తి చేశాం.

**ప్ర:** జిల్లాలోఎన్నిగ్రామపంచాయతీలు,ఎన్నివార్డులు, ఎంత మంది ఓటర్లు ఉన్నారు?

**జ:** జిల్లాలో 473 గ్రామ పంచాయతీలు, 3870 వార్డులు, 4లక్షల 47వేల 135 ఓటర్లు ఉన్నారు. గ్రామాల్లో ప్రతీ ఒక్కరు ఎన్నికల కోడ్‌ను తప్పకుండా పాటించాలి.

**ప్ర:** ఎన్నికల నిర్వహణకు ఎంత మంది సిబ్బంది నియమించారు?

**జ:** స్థానికఎన్నికల నిర్వహణకు 530మంది ఆర్ ఓస్, 1700ల మంది పీఓస్, 2300ల మంది ఓపీ ఓస్‌నునియమించాం. ఇప్పటికే శిక్షణ కూడా పూర్తయింది.

**ప్ర:** ఎన్నివిడతల్లో స్థానికఎన్నికలనునిర్వహిస్తున్నారు?

**జ:** గ్రామపంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహిస్తున్నాం. మొదటి విడతలో ఆరు మండలాలు, రెండో విడతలో 8 మండలాలు, మూడో విడతలో ఆరుమండలాల్లోని పంచాయతీల్లో ఎన్నికలు ఉంటాయి.

**ప్ర:** ఎన్నిలక్షలబ్యాలెట్ పత్రాలను సిద్ధంచేశారు?

**జ:** ఎన్నికలకు బ్యాలెట్ పత్రాలను సిద్ధం చేశాం.


**ప్ర:** జిల్లాలోఎన్నిబ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయి.

**జ:** ప్రస్తుతం 3755 జంబో బ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయి. అవసరమైతే మరికొన్ని బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయి.

● (ఆదిలాబాద్, ఆంధ్రజ్యోతి)

## తగ్గని ఆర్టీసీ బస్సు చార్జీలు

బోథ్,అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పండగ పేరుతో ఆర్టీసీ అధికా రులు ప్రత్యేకంగా బస్సుచార్జీలు వసూలు చేస్తున్నారు. పండగ ముగిసి మూడు రోజులైనా ఆర్టీసీ అధికారులు బస్సులో ప్రయాణ ధరలు మాత్రం తగ్గించడం లేదు. బోథ్ నుంచి నిర్మల్ వెళ్లాలంటే రూ.90 చార్జీగా వసూలు చేస్తున్నారు. వాస్తవానికి రూ.60 చార్జీతో నిర్మల్ వరకు ప్రయాణించే వారు అయితే ఆర్టీసీ బస్సుల్లో ప్రయా ణికులు కండక్టర్లతో వాగ్వివాదానికి దిగుతున్నారు. మహిళలకు ఉచితంగా ఇచ్చిపురుషుల జేబులుమా త్రం ఖాళీ చేస్తున్నారని ఆర్టీసీ తీరుపై అసహనం వ్యక్తపరుస్తున్నారు.



స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదలై వారం రోజులు గడుస్తున్నా జిల్లాలో కోడ్ అమలుపై అధికారులు దృష్టిసారించడం లేదు. సెప్టెంబరు 29 నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలు ముగిసేంత వరకు కోడ్ అమల్లో ఉంటుందని ఎలక్షన్ కమిషన్ ప్రకటించింది. దీంతో అధికారులు అప్రమత్తమై వాల్‌పోస్టర్స్, బ్యానర్స్ తొలగించారు. కానీ పల్లెల్లో ఇంకా మద్యం మత్తు జోరే కన్పిస్తోంది. గడిచిన వారంలోనే ఆదిలాబాద్ డివిజన్ పరిధిలో అక్రమంగా బెల్ట్‌షాపులు నడుపుతున్న వారిపై పోలీసులు 28 కేసులు నమోదు చేశారు.



తడిహత్నూర్‌లో నిర్వహిస్తున్న బెల్ట్‌షాపు



# తగ్గేదేలే!

- ఎన్నికల కోడ్ ఉన్నా ఆగని బెల్ట్‌షాపు దందా
- గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- కోడ్ పేరిటా అధిక ధరలకు విక్రయిస్తూ నిలువు దోపిడీ
- మందు విందులతో ఓటర్ల మద్దతును కూడగడుతున్న ఆశావహులు
- ఎన్నికల నియమావళిపై దృష్టిసారించని అధికారులు

ఆదిలాబాద్, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2వేల వరకు బెల్ట్‌షాపు దుకాణాలు ఉన్నట్లు అధికారుల అంచనా. మండల కేంద్రాలతోపాటు గ్రామం, వార్డుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. అయినా సంబంధిత అధికారులు పట్టించుకునట్లే కనిపించడంలేదు. అడపాదడపగా తనిఖీలు చేస్తున్నా బెల్ట్‌షాపుల వైపు మాత్రం కన్నెత్తి చూడడం లేదంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు మద్యం మత్తులో మందుబాబులు తూగుతున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న బెల్ట్ షాపు నిర్వాహకులు డోంట్‌కేర్ అన్నట్లుగానే వ్యవహరిస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### రెచ్చిపోతున్న లిక్కర్ మాఫియా

జిల్లాలో లిక్కర్ మాఫియా ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా బెల్ట్‌షాపులకు విచ్చలవిడిగా మద్యాన్ని సరఫరా చేస్తూ అమ్మేసుకుంటున్నారు. అయినా సంబంధిత శాఖ అధికారులు నోరుమెదుపక పోవడంపై తీవ్రవిమర్శలు వస్తున్నాయి. గతంలో బెల్ట్ షాపులపై దాడులు చేసి హడావుడి చేసిన పోలీసులు ప్రస్తుతం కోడ్ అమల్లో ఉన్నా కఠినంగావ్యవహరించడం లేదంటున్నారు. అధికారులను జేబులో వేసుకుంటున్న లిక్కర్ మాఫియా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలను జరుపుతున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా తెలియనట్లుగానే వ్యవహరిస్తున్నారు. ప్రతినెలా వస్తున్న మాముళ్లతోనే సరిపెట్టుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్పెషల్ స్క్వార్డ్ తనిఖీలు కూడా నామమాత్రంగానే కనిపిస్తున్నాయి. కొంతమంది అవినీతి అధికారుల అండతో అక్రమ మద్యం అమ్మకాలకు అడ్డుఅదుపే లేకుండాపోతోంది. సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నామని చెప్తున్నా మద్యం అమ్మకాలపై ఎందుకు దృష్టిసారించడం లేదన్న ప్రశ్నలువ్యక్తమవుతున్నాయి.

### బాటిల్‌పై రూ.50 అదనం

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో బెల్ట్‌షాపు నిర్వాహకులు ధరలను అమాంతంగా పెంచి అడ్డగోలుగా దండుకుంటున్నారు. ఒక్కోబాటిల్‌పై అదనంగా రూ.30 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. ఇన్నాళ్లు రూ.200లకు విక్రయించిన బీరు బాటిల్ ప్రస్తుతం రూ.250కి విక్రయిస్తున్నారు. రూ.200 లిక్కర్ క్వాటర్ రూ.260 వరకు విక్రయిస్తూ లాభాలను జేబులో వేసుకుంటున్నారు. గ్రామ వీడీసీలకు లక్షల్లో ముట్టచెప్పడంతో అడిగే వారే కరువవుతున్నారు. దీంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇదంతా సంబంధిత శాఖల అధికారులకు తెలిసినా కట్టడి చేయడంలో విఫలమవుతున్నారు. ఎన్నికల పుణ్యమా అంటూ బెల్ట్‌షాపు నిర్వాహకులు భారీగా దండుకుంటున్నారు. ఎవరైనా ఇదేమని ప్రశ్నిస్తే మద్యం లేదంటూ తిప్పిపంపుతున్నారు. గత్యంతరం లేక అధిక ధరలకైనా మద్యాన్ని కొంటూ గ్రామీణ ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు.

### ఓటర్లకు గాలం..

ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్, వార్డుమెంబర్ రిజర్వేషన్లు ఖరారు కావడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలయ్యింది. ఆశావహ నేతలు ఓటర్లను ఆకట్టుకునేందుకు మందు విందులతో ప్రయత్నాలు

(మిగతా 4వ పేజీలో)



**కఠినంగా వ్యవహరిస్తున్నాం** • జీవన్‌రెడ్డి, డీఎస్పీ ఆదిలాబాద్

జిల్లాలో స్థానిక ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఆదిలాబాద్ డివిజన్ పరిధిలో ఇప్పటివరకు 28 కేసులను బెల్ట్‌షాపు నిర్వాహకులపై నమోదు చేశాం. నిత్యం గ్రామాల్లో సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్నిరకాల జాగ్రత్తలు తీసుకుంటున్నాం. కోడ్‌ను ఉల్లంఘిస్తే సహించేదిలేదు.

# కాంగ్రెస్ పార్టీ జడ్పీ చైర్‌పర్సన్ అభ్యర్థిగా కంది మౌనారెడ్డి

- గాదిగూడ మండలం నుంచి జడ్పీటీసీగా పోటీ చేసే అవకాశం
- కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్
- జిల్లా నేతలతో ఇన్‌చార్జి మంత్రి జూపల్లి మంతనాలు



ఇన్‌చార్జీ మంత్రితో జిల్లా కాంగ్రెస్ నేతలు

ఆదిలాబాద్/టౌన్ అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి) :జిల్లా జడ్పీ చైర్మన్ అభ్యర్థిగా కంది శ్రీనివాస్‌రెడ్డి సతీమణి కంది మౌనారెడ్డిని ఖరారు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. సోమవారం జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లికృష్ణారావు హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల ఎంపిక, జడ్పీచైర్‌పర్సన్ అభ్యర్థిపై జిల్లా నేతలతో చర్చించి ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తుంది. ఈ సారి జిల్లా పరిషత్ చైర్మన్ పదవి జనరల్ మహిళకు రిజర్వ్‌డ్ కావడంతో అందరి చూపు జడ్పీ పీఠం పైననే పడింది. కాని ఊహించని విధంగా ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో జనరల్ స్థానాలు పూర్తిగా తారుమారయ్యాయి. జిల్లా 20 జడ్పీటీసీ స్థానాల్లో 8 బీసీలు, 8 ఎస్టీలు, 2 ఎస్సీలు, 2 జనరల్ స్థానాలుగా కేటాయించారు. ఇందులో గాదిగూడ జనరల్ కాగా ఇంద్రవెల్లి జనరల్ మహిళగా రిజర్వేషన్ కల్పించారు.దీంతో అందరి దృష్టి గాదిగూడ మండలం పైననే అన్నట్లుగా కనిపిస్తుంది. ముఖ్యంగా జడ్పీ పీఠం కోసం రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఆర్థికంగా, పార్టీలో మంచి పలుకుబడి ఉన్న ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కందిశ్రీనివాస్‌రెడ్డి సతీమణి కందిమౌనారెడ్డిని జడ్పీచైర్మన్ అభ్యర్థిగా పార్టీ అధిష్ఠానం ఫైనల్ చేసినట్లు తెలుస్తుంది. దీంతో కందిమౌనారెడ్డి గాదిగూడ మండలం నుంచి జడ్పీటీసీగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు కాంగ్రెస్‌పార్టీవర్గాలు చెబుతున్నాయి. ఆమెనుజడ్పీటీసీగా గెలిపించే బాధ్యతలు మాజీ ఎంపీ సోయంబాపూరావుతో పాటు కందిశ్రీనివాస్‌రెడ్డికి అప్పగించినట్లు సమాచారం. ఏజెన్సీ మండలాల్లో మంచి పట్టు ఉన్న సోయంబాపూరావుకు పార్టీ అధిష్ఠానం కీలక బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి నిర్వహిస్తున్న స్థానిక ఎన్నికలను పార్టీ అధిష్ఠానం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటుంది.

## జూనియర్స్ ఫ్యాషన్ వీక్‌లో చిన్నారి ప్రతిభ




నిర్వాహకులతో చిన్నారి ఇతిక్ష

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ గచ్చిబౌలిలో ఈనెల 4, 5 తేదీల్లో జరిగిన 97వ జూనియర్స్ ఫ్యాషన్‌వీక్‌లో ఆదిలాబాద్ పట్టణానికి చెందిన కొంకటి ఇతిక్ష పాల్గొన్నారు. కొంకటి సృజన శ్రావణ్ కుమార్ కూతురైన చిన్నారి... ప్రముఖ దుస్తుల బ్రాండ్ కిడ్సప్ దుస్తులను రన్‌వే పై ప్రమోట్ చేయడం తోపాటు.. మిగిలిన బ్రాండ్‌ల డిజైనర్స్‌ను సైతం ఆకట్టుకున్నారు.తల్లిదండ్రుల ప్రోత్సాహంతో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తానని చిన్నారి ధీమా వ్యక్తం చేసింది.

## మెడికల్ షాపుల తనిఖీ

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రిమ్స్ జీవన్‌ధార జనరిక్ మెడికల్ మందుల దుకాణాల వారు తప్పని సరిగా జీఎస్టీ బిల్లులు ఇవ్వాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అడె శ్రీలత అన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ రాజర్షిషా రిమ్స్ ఆవరణలోని మెడికల్ షాపులను తనిఖీ చేసి ఇక్కడ కొన్ని లోపాలను గుర్తించి విచారణ చేయాలని ఆదేశించడంతో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సోమవారం తనిఖీ చేశారు. దుకాణంలో ఉన్న ముందులు, రిజిస్ట్రర్, లైసెన్స్, బిల్లులు తదితర వాటిని పరిశీలించారు. జీఎస్టీ బిల్లులు ఇవ్వడం లేదని, లైసెన్స్ ఉన్న ఫార్మసిస్ట్ కాకుండా ఇతరులు ఉండటాన్ని గుర్తించారు. దీనిపై నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు అందించనున్నట్టు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ప్రతి మెడికల్ షాపులో లైసెన్స్ ఫార్మసిస్ట్ ఉండాలన్నారు. రిమ్స్ ఆవరణలోని జనరిక్ జీవనాధార మెడికల్ షాపులో జీఎస్టీ బిల్లు ఇవ్వడం లేదని, రిజిస్ట్రర్‌లు సక్రమంగా లేవని, కొన్ని మందుల బిల్లులు కూడా లేవని గర్తించడం జరిగిందన్నారు. నిబం ధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## అందరి చూపు బీజేపీ వైపు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ఉట్నూర్, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ప్రజలందరికి సుస్థిరపాలన అందిస్తూ అభివృద్ధి సంక్షేమ రంగాల కోసం కృషి చేస్తున్న భారతీయ జనతా పార్టీ వైపు ప్రజలు చూస్తున్నారని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్‌రాథోడ్ అన్నారు. సోమవారం మండలంలోని లక్కారం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న కేబీనగర్‌లో భారీగా జ్యోతి యువకులు చేరారని అన్నారు. రితేష్‌రాథోడ్ ఆధ్వర్యంలో చేరికలు జరుగడంతో జాదవ్ అనూష బాయి, జాదవ్ ప్రేమాబాయి, జాదవ్ కాంతాబాయి, రాథోడ్‌పరశురాంనాయక్, జాదవ్‌సోమలనాయక్‌లతో పాటు మరికొందరు మహిళలు అందరికి బీజేపీ కండువాలు కప్పి రితేష్‌రాథోడ్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బిందు వెంకటేశ్, జిల్లా కార్యదర్శి కొండేరిరమేష్, మాజీ ఎంపీటీసీ సీపతిలింగాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## కొమురం భీం వర్ధంతి సందర్భంగా విద్యా సంస్థలకు సెలవు

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ పోరాట యోధుడు కొమురం బీం వర్ధంతిని పురస్కరించుకుని నేడు అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటిస్తూ.. కలెక్టర్ రాజర్షి షా ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం విద్య సంస్థలకు సెలవు ఉంటుందని, డిసెంబర్ రెండవ శని వారాన్ని పని దినంగా పరిగణించాలని సూచించారు. కొమురం భీం పోరాటాలు, త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలన్నారు.

## డీజే యజమానిపై కేసు నమోదు

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఈనెల నాల్గవ తేదీన పట్టణంలోని శాంతినగర్ వద్ద దుర్గామాత నిమజ్జనం సమయంలో అనుమతి లేకుండా డీజే పెట్టడంతోపాటు శాంతి నగర్‌లో రాకపోకలకు అంతరాయం తలెత్తేలా వ్యవహరించిన కేసులో డీజే యజమనిపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

## కపాస్ కిసాన్ యాప్ వినియోగంపై అవగాహన

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పత్తి సాగు చేస్తున్న రైతుల కీలక సమాచారంతో పాటు విక్రయాల కోసం కొత్త యాప్‌ను ప్రభుత్వం తీసుకువచ్చిందని, దీనిపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడంతోపాటు కౌలు రైతుల వివరాలను నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం రిమ్స్‌లోని ఆడిటోరియంలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులకు కపస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్, కౌలు రైతుల రిజిస్ట్రేషన్ చేయడంపై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా టెక్ ఏసీ సాఫ్ట్‌వేర్ నుంచి ట్రైనర్ దీపక్ రిజిస్ట్రేషన్, కిసాన్ యాప్ గురించి పవర్ పాయింట్ ప్రాజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం పలువురు ఏఈఓలు అడిగిన ప్రశ్నలకు కలెక్టర్‌తో పాటు మార్కెటింగ్‌శాఖ డీడీ పద్మలు సమాధానాలు ఇస్తూ సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ..పత్తి పండించిన రైతులు సీసీఐకి విక్రయించడానికి ఎలాంటి ఇబ్బందులు పడకుండా కపస్ కిసాన్ యాప్‌ను తీసుకువచ్చారన్నా రు. ఇందులో రైతులు స్లాట్ బుక్ చేసుకుని ఎక్కడ విక్రయించాలని అనుకుంటారో తెలియ జేయాలన్నారు.కౌలు రైతుల వివరాలను సేకరించి వారికి కూడా ప్రభుత్వ ఫలాలు, మద్ధతు ధరలు లభించేల ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. యాప్ లో కౌలు రైతుల వివరాలను నమోదు చేయడంతో ఎంత మంది ఉన్నారో తెలిసిపోతుందన్నారు. గతంలో రెవెన్యూ శాఖకే వివరాలు ఇచ్చేందని, ఇప్పుడు ఆ బాధ్యతను ఆన్‌లైన్ లో చేయడానికి వ్యవసాయ శాఖకే అప్పగించిందన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. స్లాట్ ఎలా బుక్ చేయాలో వివరిస్తే ఏఈఓల పని మరింత సులు వుగా అవుతున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యా మలదేవి, మార్కెటింగ్ ఏడీ గజానంద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి,ఏడీఏ,ఏఈఓలు,అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో సూచనలు చేస్తున్న కలెక్టర్

# పత్తి రైతుకు గులాబీ గుబులు

- దూది పంటకు సోకుతున్న గులాబీ పురుగు
- రాలిపోతున్న పత్తి కాయలు
- ఎకరాకు మూడు క్వింటాళ్ల దిగుబడి కష్టమే
- నట్టేట ముంచుతున్న ఎడతెరిపిలేని వర్షాలు
- జిల్లాలో 4.28 లక్షల ఎకరాల్లో పత్తి సాగు

పత్తి రైతుకు గులాబీ గుబులు పట్టుకుంది. ఈయేడు కురుస్తున్న భారీ వర్షాలు రైతులను నట్టేట ముంచుతున్నాయి. ఎడతెరపి వర్షాలతో కాసిన పత్తికాయలన్నీ రాలిపోతున్నాయి. చేతికి వచ్చిన సోయా పంట నేలపాలవుతోంది. ఈ ఖరీఫ్‌లో పంటలకు ఖర్చు చేసిన దాంట్లో కనీసం పెట్టుబడి సైతం వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.



రాలిపోయిన పత్తి కాయలు



పూతలో గులాబీ పురుగు



నీరు చేరి జౌకు పట్టిన పత్తి పంట

తాంసి, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 4లక్షల 28వేల ఎకరాల్లో పత్తి పంట సాగవుతోంది. ఈ ఖరీఫ్‌లో సోయా సాగు విస్తీర్ణం సైతం పెరిగింది. గడిచిన రబీలో నష్టపోయిన రైతులు ఖరీఫ్‌పై ఆశలు పెట్టుకున్నారు. కానీ ఈ ఖరీఫ్‌లోనూ రైతులకు కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. తీరుస్తాయని గంపెడు ఆశతో ముందడుగు వేశారు. కళ్లముందే పంటలన్నీ పాడవుతుంటూ చూస్తూ రైతులు తల్లడిల్లుతున్నారు. పంట చేతికి వచ్చే అవకాశాలు లేకపోవడంతో అప్పులు ఎలా తీర్చా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పెరిగిన సాగు విస్తీర్ణం

గతంలో కంటే ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. చెరువులు, వాగులు, కుంటల్లో భారీగానే వరద చేరింది. 8,500 ఎకరాలకు సాగునీరు అందించే మత్తడి వాగు ప్రాజెక్టు సైతం నీటితో కళకళలాడుతోంది. పత్తి సాగుతోపాటు సోయా, వరి సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. వరికి ఈకాలం అనుకూలంగా ఉన్నా ఆ పంటకు తెగులు సోకుతున్నాయని రైతులు చెప్తున్నారు. ఈసారి ఖరీఫ్‌లో కూరగాయలు, పెసరి, మినుము పంటలను సాగు చేస్తున్నారు. అయితే ఎడతెరిపిలేని వర్షాలు పంటలను ముంచెత్తుతున్నాయి. దీంతో నష్టాలు తప్పడం (మిగతా 4వ పేజీలో)